




అంగన్వాడీల శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రభుత్వంతో అంగన్వాడీ

- నిరవధిక సమ్మె ఉధృతం
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం
- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వ్యాఖ్యలపై ఆగ్రహం
- మద్దతు ప్రకటించిన టిడిపి, జనసేన, సిపిఎం, ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాలు

అంగన్వాడీల సమ్మె పతాకస్థాయికి చేరింది. అంగన్వాడీలు నిరవధిక సమ్మె విరమించాలని, లేకుంటే విధులకు గైర్హాజరైనట్లు భావించి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ బెదిరింపులు ఓవైపు... అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలుకొట్టాలని ఉన్నతాధికారుల హెచ్చరికలు మరోవైపు... దీక్షా శిబిరాల వద్దకు అధికారులు వచ్చి తాళాలివ్వాలంటూ హుంకారాలు ఇంకోవైపు... మహిళలని కూడా చూడకుండా చులకనాభావంతో ఓ ప్రజాప్రతినిధి చేసిన అనుచిత వ్యాఖ్యలు మరోవైపు.. ఎవరెన్ని చేసినా అంగన్వాడీలు ఏమాత్రమూ వెనుకడుగు వేయడం లేదు. మడమ తిప్పడం లేదు. నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని తేల్చిచెబుతున్నారు. పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. అంగన్వాడీల సమ్మెకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది.



విజయనగరంలో మానవహారం చేపడుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.వి.రమణ, జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు మాట్లాడారు. అంగన్వాడీలపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బేషరుతుగా ఎమ్మెల్యే అంగన్వాడీలకు క్షమాపణ చెప్పాలని, పోలీసులు సుమోటాగా ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సెంటర్ల తాళాలు బద్దలుకొట్టి తెరిపించడాన్ని తప్పుబట్టారు. తాళాలు బద్దలు కొట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కవ్వింపు చర్యలు ఆపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల పోరాటాన్ని బలపరుస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ తెలిపారు. మానవహారంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, యుఎస్ రవికుమార్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, నాయకులు విశాలాక్షి, శివలక్ష్మి, మంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

చీపురుపల్లి : చీపురుపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద మూడో రోజు అంగన్వాడీల సమ్మె శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు బలగ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : బాడంగిలో మూడో రోజు అంగన్వాడీల సమ్మె కొనసాగింది. అంగన్వాడీల శిబిరాన్ని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలవలస గౌరు సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేష్, రవణమ్మ పాల్గొన్నారు.



భోగాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

గంట్యాడ : గంట్యాడ ఐసిడిఎస్ కార్యాలయం నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ చేపట్టారు. అనంతరం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.

రామభద్రపురం : అంగన్వాడీల మూడో రోజు సమ్మెలో భాగంగా ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో చేపట్టారు. దీంతో వాహన రాకపోకలు స్తంభించాయి. పోలీసులు అక్కడికి చేరుకుని, ట్రాఫిక్‌ను నియంత్రించారు. అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, ఎపిటిఎఫ్ నాయకులు బి.జోగి నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు సందర్శించి, మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.తిరుపతి నాయుడు, మండల కార్యదర్శులు పద్మజ, వి.రామబ్రహ్మం, అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, రాధమ్మ, కుమారి పాల్గొన్నారు.

భోగాపురం : భోగాపురంలో ఎంపిడిఒ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు అంగన్వాడీలు భారీర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం దారుణం : పిపిఎస్‌ఎస్

అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించలేని దద్దమ్మ ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో కేంద్రాలను నడపాలనుకోవడం దుర్మార్గమని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు ఒక ప్రకటనలో ఖండించారు. అంగన్వాడీలపై బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంటక చినప్పలనాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. అంగన్వాడీల న్యాయమైన సమ్మెను ప్రజలంతా బలపర్చాలని కోరారు.

శంబంగి క్షమాపణ చెప్పాలి : ఐద్వా

అంగన్వాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే శంబంగి వెంటనే క్షమాపణ చెప్పాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం.. సచివాలయాల ఉద్యోగులతో అంగన్వాడీ కేంద్రాలు నడిపించే ప్రయత్నం చేయాలనుకోడం సిగ్గుచేటని విమర్శించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



చీపురుపల్లిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, శృంగవరపుకోటలో అంగన్వాడీలకు మద్దతుగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్నమాజీ ఎమ్మెల్యే లలితకుమారి

అంగన్వాడీల సమ్మెపై అక్కసు

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని ఆగ్రహం

ప్రజాశక్తి - జామి, శృంగవరపుకోట, కొత్తవలస

అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మెపై ప్రభుత్వ పెద్దలు, అధికారులు అక్కసు వెళ్లగక్కడం ప్రభుత్వ దిగజారుడు తనాన్ని తెలియజేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ధ్వజమెత్తారు. అంగన్వాడీ కార్యకర్తలు ప్రజాస్వామ్య పద్ధతిలో సమ్మె చేస్తుంటే, పాలకులు అడ్డదారుల్లో కేంద్రాలు తెరవాలని చూడట మేమిటని, ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. గురువారం శృంగవరపుకోట, జామి, కొత్తవలసలో అంగన్వాడీల సమ్మెలో భాగంగా చేపడుతున్న ఆందోళనల్లో ఆయనతోపాటు ఎపి రైతుసంఘం, ఎఐటియుసి, సిఐటియు నాయకులు పాల్గొని, సంఘీభావం తెలియజేశారు. శృంగవరపుకోట పట్టణంలో దేవి కూడలిలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తమ్మినేని మాట్లాడుతూ మాత, శిశు సంరక్షణ కోసం సేవలందిస్తున్న అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండిగా వ్యవ హరించడం దుర్మార్గమ న్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినప్పల నాయుడు.. అంగన్వాడీలపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని మాట్లాడాలని, అలా కాకుండా నోటికి ఏది వస్తే అది పలకడం సమంజసం కాదని, ఆ స్థాయికి తగదని హితవుపలికారు. కొత్తవలసలో దీక్షా శిబిరం వద్దకు సిడిపిఒ వచ్చి తాళాలు ఇవ్వాలని అంగన్వాడీలను కోరడంతో తమ్మినేని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, చెలికాని ముత్యాలు, ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు చల్లా జగన్, ఎఐటియుసి నాయకులు వి.మాణిక్యం, సుశీల, వెంకటలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆర్.వెంకటలక్ష్మి, బి.కనకమహాలక్ష్మి, ఆర్.రామలక్ష్మి, ఆదిలక్ష్మి, పి.విష్ణమ్మ, ఎల్.శ్రీదేవి, కాకర తులసి, శంకరావతి, డి.శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మద్దతు

శృంగవరపుకోటలో సమ్మె శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, వార్డు మెంబెర్ పెదగాడ రాజు, భీశెట్టి మోహన్ కుమార్, సిపిఐ నాయకులు ఎం.రమణ సందర్శించి, మద్దతు తెలియజేశారు.



బొబ్బిలి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-బొబ్బిలి

అంగన్వాడీ కార్యకర్తలపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని ఎన్‌టిఆర్ బొమ్మ జంక్షన్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు కాంగ్రెస్ నేతలు మువ్వల శ్రీనివాసరావు, మడకపాటి శ్రీను, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, పికెఎస్ జిల్లా అధ్యక్షులు టి.అప్పలనాయుడు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల, ఉమాగౌరి, రోజా, తదితరులు పాల్గొన్నారు.

ఒళ్లు బలిసి మాట్లాడుతున్నది వైసిపి నేతలే

మాజీమంత్రి అమరనాథరెడ్డి
- అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి మద్దతు

ప్రజాశక్తి-గరివిడి

మహిళలని చూడకుండా అంగన్వాడీల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి నేతల తీరు దారుణమని మాజీమంత్రి అమరనాథ రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున వ్యాఖ్యానించారు. వయసు, హోదా మరిచి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్యన్నారు. వైసిపి నేతలే ఒళ్లు బలిచి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గరివిడిలో అంగన్వాడీలు నిరసన ర్యాలీ చేపట్టారు. అంగన్వాడీలకు మద్దతుగా టిడిపి, జనసేన నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో సిఎం జగన్ ఇచ్చిన హామీలనే అమలు చేయాలని అంగన్వాడీలు కోరుతున్నారని గుర్తుచేశారు. అంగన్‌వాడీలకు అండగా నిలిచి పోరాటాల్లో పాల్గొంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ముల్లు రమణ, అడపా సూర్యనారాయణ, రెడ్డి లక్ష్మణరావు, మీసాల కాశీ, సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు, అంగన్వాడీ సంఘం నాయకులు రౌతు వరలక్ష్మి, రూపావతి, కృష్ణవేణి, సరళ, పాల్గొన్నారు. అంగన్వాడీలకు యుటిఎఫ్ నాయకులు డి.రాము, ఎ.సత్యశ్రీనివాసరావు, మీసాల రవికుమార్ మద్దతు పలికారు.



అంగన్వాడీల ర్యాలీలో పాల్గొన్న మాజీమంత్రి అమరనాథరెడ్డి, కిమిడి నాగార్జున

సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర

- బలవంతంగా అంగన్వాడీ కేంద్రాలు తెరిపిస్తున్న ప్రభుత్వం
- అంగన్వాడీలకు బెదిరింపులు
- తాళాలు పగులగొట్టి తెరుస్తున్న వైనం



రేగిడి.. ఆర్ఆమదాలవలసలో పోలీసుల సమక్షంలో అంగన్వాడీ కేంద్రం తాళం పగులకొడుతున్న అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పాదయాత్రలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలు కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపడుతున్న అంగన్వాడీలపై ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోంది. నిరవధిక సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర పన్నుతోంది. పోరాటాన్ని అణచివేసే చర్యలకు పూనుకుంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ నుంచి మండల స్థాయి అధికారుల వరకు బెదిరింపులు, అంగన్వాడీ కేంద్రాల తాళాలను విరగ్గొట్టడం వంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టని పాలకులు, అధికారులు... హెచ్చరికలు, బెదిరింపు చర్యలకు దిగడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, సిడిపిఒలు, జిల్లా అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను సిడిపిఒల ఆధ్వర్యంలో గురువారమే స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్... ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సిడిపిఒలను ఆదేశించారు. సంక్షేమ కార్యదర్శులు, మహిళా పోలీసులు, విఆర్ఒలు తదితర సచివాలయ సిబ్బందిలో ఒక్కొక్కరికి ఒక్కో సచివాలయం బాధ్యతలు అప్పగించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలు శుక్రవారం నుంచి ఉదయం 9 గంటలకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో తెరవాలని, పిల్లలను ఆయా కేంద్రాలకు రప్పించాలని ఆదేశించారు. దీంతో ఎక్కడికక్కడ కమిషనర్లు, ఎంపిడిఒలు సమావేశాలు ఏర్పాటుచేసి, ఆగమేఘాలపై అంగన్వాడీ కేంద్రాలపై పడ్డారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. విజయనగరం అర్బన్ ఐసిడిఎస్ పరిధిలో మూడు సెక్టార్లలో ఏడు కేంద్రాలను తెరిపించారు. గరివిడి మండలంలో 82 కేంద్రాల తాళాలను బద్దలుగొట్టారు. నెల్లిమర్ల మండలం సతివాడ కేంద్రాన్ని తెరిచారు. గజపతినగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 272 సెంటర్లకు గాను 34 అంగన్వాడీ కేంద్రాలను అధికారులు బలవంతంగా తెరిచారు. వంగర మండలంలో మొత్తం 69 అంగన్వాడీ సెంటర్లకు గాను గురువారం మధ్యాహ్నానికి 10 సెంటర్లు తెరిపించారు. బాడంగి మండలంలో 20 కేంద్రాలను అధికారులు బలవంతంగా తెరిచారు.

బొబ్బిలి : బొబ్బిలి మున్సిపాలిటీలో 104 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా అందులో 46 కేంద్రాల తాళాలను ఐసిడిఎస్ సిబ్బంది, అధికారులు, సచివాలయ ఉద్యోగులు స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు పిఒ విజయలక్ష్మి తెలిపారు. బొబ్బిలి రూరల్‌లో డొంగురువలస, విజయపురి గ్రామాల్లో కేంద్రాలను బలవంతంగా తెరిచారు.

చీపురుపల్లి : తాళాలు పగులుగొట్టి అంగన్‌వాడీ సెంటర్లను స్వాధీనం చేసుకోవాలని ఎంపిడిఒ జి.గిరిబాల సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎంపిడిఓ కార్యాలయంలో అత్యవసరంగా సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో సచివాలయ సిబ్బంది, విఆర్‌ఒలు ఆగమేఘాలపై 80 అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లి తాళాలను పగులుగొట్టారు. కార్యక్రమంలో పిఒ కెవిఎస్ఎన్ రాజేశ్వరి పాల్గొన్నారు.

రేగిడి : తహశీల్దార్ సుదర్శన్‌రావు, ఎంపిడిఒ శ్యామలకుమారి, సచివాలయ ఉద్యోగులు వెళ్లి అంగన్వాడీలు కార్యకర్తలు లేకుండా తాళాలు పగులుగొట్టి, సరుకులు స్వాధీనం చేసుకున్నారు. రాజాం ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో 85 కేంద్రాలుండగా, 12 కేంద్రాలను తెరిచారు.

నిరసన శిబిరాల వద్దకు అధికారులు

కొత్తవలస : కొత్తవలసలో అంగన్వాడీలు చేపడుతున్న నిరసన శిబిరం వద్దకు సిడిపిఒ, సూపర్వైజర్లు వచ్చారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలివ్వాలని కోరారు. తాళాలిచ్చే ప్రసక్తే లేదని ముక్తకంఠంతో అంగన్వాడీలు బదులిచ్చారు. చేసేది లేక అధికారులు వెనుదిరిగారు.

భోగాపురం : భోగాపురంలో అంగన్వాడీ కేంద్రాల తాళాలు అందజేయాలని ఎంపిడిఒ అప్పలనాయుడు కోరగా, అంగన్వాడీలు నిరాకరించారు. దీంతో భోగాపురంలో బొల్లువీధి వద్ద పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రం తాళాలను పంచాయతీ ఇఒ రామకృష్ణనాయుడు హెచ్‌ఎం వద్ద నుంచి తీసుకొని తెరిచారు. ప్రాజెక్టు పరిధిలో నాలుగు కేంద్రాలను బలవంతంగా తెరిచారు.



బలవంతంగా అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచేందుకు వచ్చిన అధికారులను అడ్డుకుంటున్న చిన్నారుల తల్లిదండ్రులు

అడ్డుకున్న తల్లిదండ్రులు

జామి : మండల కేంద్రమైన జామిలో అంగన్వాడీ కేంద్రాలు తెరిచేందుకు ప్రయత్నించిన అధికారులకు ఊహించని షాక్ తగిలింది. జామిలో అంబేద్కర్, అల్లువీధి అంగన్వాడీ కేంద్రాలను ఎంపిడిఒ సతీష్ ఆధ్వర్యంలో బలవంతంగా తెరిచేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అంబేద్కర్ పాఠశాల ప్రాంగణంలోని కేంద్రాన్ని పోలీసుల పహారాలో బలవంతంగా తెరిచారు. అల్లువీధి పాఠశాలలో కేంద్రాన్ని తెరిచేందుకు వెళ్లగా చిన్నారులు తల్లిదండ్రులు అడ్డుకున్నారు. అధికారులు ఎంత నచ్చజెప్పినా తల్లిదండ్రులు వెనుకడుగు వేయలేదు. ఆయా, టీచర్ వచ్చేంత వరకు కేంద్రాన్ని తెరవనీయబోమని అడ్డుకున్నారు. తెరిచేందుకు వెళ్ళిన వారిలో ఇఒపిఆర్‌డి శ్రీదేవి, సూపర్ వైజర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు. మండలంలో 35 కేంద్రాలను అధికారులు బలవంతంగా తెరిచారు.



వేపాడ.. అంగన్వాడీ కేంద్రం తాళాన్ని సుత్తితో పగలకొట్టిస్తున్న ఎంపిడిఒ





అభివాదం చేస్తున్న ఆశావర్కర్ల సంఘం నాయకులు, సిఐటియు నాయకులు ; నిరవధిక ధర్నా శిబిరం వద్ద చలిలో నిద్రిస్తున్న ఆశావర్కర్లు

సమస్యల పరిష్కారం కోసం

ఆశావర్కర్ల నిరవధిక ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విజయనగరం కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరవధిక ధర్నా, వంటావార్పు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో ఆశా వర్కర్లు కలెక్టరేట్‌కు చేరుకుని, ధర్నాలో పాల్గొన్నారు. ఆశావర్కర్ల ఆందోళనకు సిఐటియు మద్దతు తెలియజేసింది. ధర్నానుద్దేశించి ఆశావర్కర్ల యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.సుధారాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లపై పనిభారం పెంచి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పని భారాన్ని తగ్గించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మొబైల్ వర్క్ శిక్షణ ఇవ్వాలని, రికార్డ్ లేదా ఆన్‌లైన్‌లో ఏదైనా ఒకే పని చేయించాలన్నారు. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని కోరారు. వేతనంలో సగం పించను ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 62 ఏళ్ల రిటైర్మెంట్ జిఒ వర్తింపజేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఎఎన్ఎం, హెల్త్ సెక్రెటరీ నియామకాల్లో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

అనంతరం శిబిరం వద్ద వంటావార్పు చేసి, అక్కడే భోజనాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు టి.వి.రమణ, జిల్లా నాయకులు యుఎస్ రవికుమార్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్.శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న జిడిఎస్ ఉద్యోగులు

జిడిఎస్ ఉద్యోగుల సమ్మె

విజయనగరం టౌన్ : 8 గంటలు పని దినాన్ని అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని తపాలా శాఖలో ఉన్న జిడిఎస్ ఉద్యోగులు గురువారం నుంచి సమ్మెబాట పట్టారు. సమ్మె సందర్భంగా స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిడిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పెంట పాపయ్య మాట్లాడుతూ 8 గంటల పనిదినాన్ని అమలుచేసి, తపాలా శాఖ ఉద్యోగులతో సమానంగా పించను, మిగతా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కమలేష్ చంద్ర కమిటీ నివేదిక అమలు చెయ్యాలన్నారు. అశాస్త్రీయ లక్ష్యాలు, అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి జి.గోవిందరావు, జిడిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభం

విజయనగరం టౌన్ : ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంధన పొదుపు వారోత్సవాలను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రారంభించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు చేపట్టిన ర్యాలీని జెసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్తు పొదుపు మానవ జీవితంలో భాగంగా ఉండాలన్నారు. ఇంధన పొదుపు ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతోపాటు భావితరాలకు మంచి భవిష్యత్తు, మంచి వాతావరణాన్ని ఇస్తామన్నారు. నేడు మానవ జీవితానికి విద్యుత్తు ప్రధాన అవసరంగా మారిందని తెలిపారు. అనంతరం విద్యుత్తు శాఖ రూపొందించిన పొదుపు వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ అనిత, విద్యుత్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

01/2019 సర్క్యులర్ అమలుకు పోరాటం

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపిఎస్ఆర్‌టిసి ఉద్యోగులు పోరాడి సాధించుకున్న 01/2019 సర్క్యులర్ అమలయ్యే వరకు పోరాటం చేస్తామని ఎస్‌డబ్ల్యుఎస్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య స్పష్టంచేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్ట్రీయల్ హాల్లో ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు సిహెచ్.వెంకటరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న సర్క్యులర్‌ను ప్రభుత్వం అమలు చేయకుండా పక్కన పెట్టడం అన్యాయమన్నారు. సర్క్యులర్ అమలైతే కార్మికుల ఉద్యోగ భద్రత లభిస్తుందని, అదే భరోసాతో విధులు నిర్వర్తించడం వల్ల ఒఆర్ పెరుగుతుందని తెలిపారు. నేడు ఉద్యోగులు మళ్లీ అభద్రతాభావంతో ఉద్యోగం చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ భద్రత ఉండగా ఇక్కడ ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఎంటిడబ్ల్యు యాక్టు సెక్షన్ 124, 178 అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో సదస్సుల ఏర్పాటుచేసి, అనంతరం రాష్ట్ర స్థాయిలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీతాలక్ష్మి, డిపో కార్యదర్శి చంద్రయ్య, నాయకులు ఎ.రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య

గిరిజన హక్కులు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

అభివృద్ధిలో వెనుకబడిన గిరిజనులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు అన్నారు. గురువారం మండలంలోని కామందొర పంచాయతీ దొంగరువలస, కొత్తవలస గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలను ఆది నుండి సమస్యలు వెంటాడుతున్నాయని వారికి రాజ్యాంగంలో ప్రత్యేకమైన హక్కులు ఉన్నాయని అవి వారు వినియోగించుకోవాలని చెప్పారు. వారి హక్కులు, వారి బతుకులు కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టి కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. గిరిజన సమస్యలపై ఎస్‌టి కమిషన్‌కు ఒక్క ఉత్తరం రాసినా స్పందిస్తామన్నారు. పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు అటవీ హక్కుల పథకం ద్వారా రాష్ట్రంలో 2.25 లక్షల మంది గిరిజనులకు పట్టాలు మంజూరు చేశామన్నారు. గిరిజనులు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. మన అభివృద్ధికి మనమే పాటు పడాలన్నారు. గ్రామంలో శ్మశాన వాటిక, రహదారి పనులకు అధికారులను ఆదేశిస్తామన్నారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చెయ్యాలని గిరిజన సంఘం నాయకులు కోరడంతో ఈ జిల్లా మైదాన ప్రాంతంలో ఉన్నందున ప్రయత్నిస్తానన్నారు.

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి



వినతి పత్రాలను స్వీకరిస్తున్న చైర్మన్ డివిజి

ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చెయ్యాలి

తమ గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చెయ్యాలని మండలంలోవున్న గిరిజన తండా వాసులు చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వలసలు వచ్చిన గిరిజనులకు పంచాయతీల్లో కలపాలని ఆదివాసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అప్పలరాజు దొర కోరారు. ఐటిడిఏ ఏర్పాటు చెయ్యాలని, పూర్తి స్థాయిలో పట్టాలు మంజూరు చేయాలని, గ్రామంలో పెత్తందార్లకు భూములున్నాయని, గ్రామానికి శ్మశాన వాటికకు స్థలం మంజూరు చెయ్యాలని, షికారుగంజి గ్రామంలో నివసిస్తున్న గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చెయ్యాలని గిరిజన రైతు కూలీ సంఘం నాయకులు వర్మ కోరారు. 75 ఏళ్లుగా గిరిజన బతుకులు మారలేదని ఇప్పటికి డోలీల మోత తప్పడం లేదని గిరిజన రోడ్లు వెయ్యాలని మండలంలోని సి.హెచ్ బొడ్డవల పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడం లేదని వెంటనే మంజూరు చెయ్యాలని గిరిజన జెఎసి నాయకులు సీతారాం కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఏడు మండలాల వివిధ శాఖ అధికారులతో సమీక్ష చేశారు.

వినతులు పరిష్కరిస్తాం : ఆర్‌డిఓ

ఈ సమావేశంలో వచ్చిన వినతులు రెవెన్యూ అటవీశాఖ ఆధ్వర్యంలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని, ఇప్పటికే షికారుగంజిలో నివసిస్తున్న గిరిజనుల నివాస గృహాలకు భూమిని సేకరించామని ఆర్‌డిఓ సాయిశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయ పనుల పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ గురువారం సాయంత్రం పరిశీలించారు. మొత్తం 9 జోన్ల పరిధిలో విమానాశ్రయం, రన్‌వే ప్రాంతం, వర్క్‌షాప్, కాంక్రీట్ ప్లాంట్, పరిపాలనా భవనం, ట్రంపెట్ రహదారిని నిర్మించే ప్రాంతాలను సందర్శించారు. భూమిని చదును చేస్తున్న పనులను, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను, మ్యాప్‌లను పరిశీలించారు. నిర్మాణ పనులు గురించి జిఎంఆర్ అధికారులు రామరాజు, కోటేశ్వరరావు, ఎల్ అండ్ టి ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, రహదారుల నిర్మాణం గురించి కలెక్టర్ ఆరా తీశారు. రాత్రి పగలు పనులు జరుగుతున్నాయని, జనవరి నెలాఖరులోగా ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వివరించారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, తహశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న వెంకటరావు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేటలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల శాలను, పశువులను కోల్పోయిన సంగతి తెలిసిందే. గేదెను కోల్పోయిన కండిపల్లి దేవుడునకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ రూ. 10వేలు అందించారు. మంటల్లో గాయపడిన పెయ్యకు చెందిన రైతు గొర్ల అప్పారావుకు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు రూ.3వేలు అందించారు. కండిపెల్లి అప్పలరాజుకు చెందిన గడ్డివాము కాలిపోవడంతో ఆయనకు మరో రూ. 2వేలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, గొర్లె నాగరాజు, చిరికి రమణ, మంచిన అప్పలసూరి, వై సూర్యం, తాడి కృష్ణ, కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువలో హెచ్‌పి గ్యాస్

చీపురుపల్లి: ప్రజలకు మరింత సేవలందించాలనే ఉద్దేశంతో మరొక హెచ్‌పి గ్యాస్ సెంటర్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సుందరదసన్ తెలిపారు. గురువారం చీపురుపల్లి పట్టణంలో మీసాల సీతారామమూర్తి (బాలు)కి మంజూరైన నూతన హెచ్‌పి గ్యాస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయం మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ హెచ్‌పి గ్యాస్ ఉండాలన్నదే లక్ష్యమన్నారు. కేంద్రం అందిస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందించే విధంగా ఏజెన్సీలకు తెలియ జేసామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లేబర్ ఆఫీసర్ మీసాల ఆనందరావు, హెచ్‌పిసియల్ సేల్స్ మేనేజర్ శ్రీహర్ష, గవిడి సురేష్, పల్నాల వెంకటరావు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి

కొత్తవలస: ఈ నెల 16,17 తేదీల్లో నెల్లిమర్లలో జరగనున్న 31వ ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్‌సి బాలుర వసతి గృహం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో చేసిన పోరాటాలు, విజయాలు, భవిష్యత్తు కర్తవ్యాలు చర్చించుకుని జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యల కోసం పని చేయడానికి మహాసభ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చైతన్య, నాయకులు తేజ, గణేష్, విక్రమ్, అరుణ్, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: రోడ్డుపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, మిలటరీ కాలనీ, బోస్ నగర్, రాజ్ మహల్ ప్రాంతాల్లో గురువారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువలు, జనసంద్ర ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్ ద్వారా ఉపాధి

నెల్లిమర్ల: మెప్మా అర్బన్ మార్కెట్ ద్వారా సంఘాలకు ఉపాధి ఉంటుందని మెప్మా సిఎంఎం డి. గోవింద రావు అన్నారు. గురువారం నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్‌లో మెప్మా అర్బన్ మార్కెట్ నిర్వహించారు. దీనిలో భాగంగంగా 25 సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. గోవింద రావు మాట్లాడుతూ అర్బన్ మార్కెట్ ప్రదర్శన ద్వారా అన్ని వస్తువులు దొరికే అవకాశం ఉందని, దీని ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్లీ హుడ్ స్పెషలిస్ట్ వేణుగోపాల్, సిఒ, ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే మానసిక ఒత్తిడిని జయించవచ్చు

డెంకాడ: ఏకాగ్రతతోనే మానసిక ఒత్తిడిని జయించవచ్చునని మనస్తత్వ శాస్త్ర నిపుణులు డాక్టర్ సుభాష్ అన్నారు. స్థానిక లెండి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాస్‌లలో భాగంగా ఒత్తిడి నిర్వహణపై జివిపి మెడికల్ కాలేజ్ సైకాలజిస్ట్ డాక్టర్ సుభాష్‌తో అవగాహన కల్పించారు. ఒత్తిడి యొక్క చిక్కులను, దానిని సమర్థవంతంగా ఎదుర్కోవటానికి ఆచరణాత్మక వ్యూహాలను విద్యార్థులకు ఆయన వివరించారు. దీనికి ముందుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి డాక్టర్ సుభాష్‌కు పుష్పగుచ్ఛం, శాలువాను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ హెడ్ డాక్టర్ పి.దుర్గా శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్తును పొదుపుగా వాడాలి

బొబ్బిలి: విద్యుత్తును పొదుపుగా వాడాలని విద్యుత్ శాఖ ఇఇ ఆవాల అనంతరావు కోరారు. విద్యుత్ వారోత్సవాలను డివిజనల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తును పొదుపుగా వాడితే పర్యావరణాన్ని కాపాడగలమన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా విద్యుత్ పొదుపుపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే..

బొబ్బిలి: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి అన్నారు. ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం కొరతతో గర్భిణులు, ప్రమాదాలలో గాయపడిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తదానం చేసేందుకు యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, ప్రిన్సిపాల్ రెడ్డి మోహన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డు వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నెల్లిమర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం వార్డు వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ నగర పంచాయతీ పరిధిలో 7 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 15 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని వారికి ఇంటర్వ్యూలు నిర్వహించామని చెప్పారు. మేనేజర్ టివియస్ విశ్వేశ్వర రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ. రాజ్యలక్ష్మి, సీనియర్ సహాయకులు వైఎస్‌సిహెచ్ పాపయ్య రాజు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు 15న నియామకపత్రాలు జారీ చేస్తామని కమీషనరు తెలిపారు.

సంక్షేమ పథకాలు అందాలంటే జగనే రావాలి

వేపాడ: సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగనే సిఎంగా రావాలని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సింగరాయి గ్రామంలో గురువారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంతవరకు అందిన సంక్షేమ పథకాలు బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, డిసిసిబి చైర్మన్ నాయుడు, సింగరాయి సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, ఇఒపిఆర్‌డి ఉమా, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, గ్రామ వాలంటీర్లు, వైసిపి నాయకులు డి. మహేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లిలో గురువారం వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, మున్సిపల్ ఛైర్మెన్ సావు మురళీ కృష్ణలు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారదర్శకంగా రైతు భరోసా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజులలోపు వారి ఖాతాల్లో డబ్బులు నేరుగా జమ చేస్తామన్నారు. కో ఆప్షన్ మెంబర్ తెర్లీ సత్యారావు, బొబ్బిలి పిఎసిఎస్ ఛైర్మెన్ బొమ్మి అప్పలనాయుడు, వైసిపి నాయకులు దమ్మ అప్పారావు , తుట్ట తిరుపతి, నెలివాడ సింహాచలం, బైరెడ్డి అప్పారావు, దుప్పలపోడి అప్పారావు, తిరమరెడ్డి సింహాచలం, అగ్రికల్చర్ ఎడి శ్యాంసుందర్, ఎంపిఇఒ పుణ్యవతి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గొల్లపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 3.61 లక్షలు

చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి త్రైమాసిక ఆదాయం రూ. 3,61,993లు వచ్చినట్లు ఆలయ ఇఒ జి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం అమ్మవారికి సంబంధించి సెప్టెంబరు 13 నుండి డిసెంబరు14 వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారిణి పివి లక్ష్మి, ఆలయ కమిటీ ఛైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశరావు, వైస్ ఛైర్మన్ సూరు కుమార్, మెంబర్లు వంకల కృష్ణ, రేగిడి అప్పలనాయుడు, కంది శ్రీరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యువగళం సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - భోగాపురం

నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి అన్నారు. పోలిపల్లి సమీపంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో జన సమీకరణ పై సమీక్ష సమావేశం గురువారం నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు సత్యన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ తదితరులు మాట్లాడుతూ యువగళం ముగింపు సభతోనే ఎన్నికల శంఖారావం మొదలవుతుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరు ఈ సభకు హాజరు కావాలని కోరారు. టిడిపి నాయకులు కడగల ఆనంద్ కుమార్, పల్లె భాస్కరరావు, లీలావతి, తమ్మి నాయుడు, మహతి శంకర్రావు , అప్పలనారాయణ పాల్గొన్నారు.

బొబ్బిలి: టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం ముగింపు పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా కోరారు. కోటలో గురువారం ముగింపు సభను జయప్రదం చేయాలని నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈ నెల 20న నెల్లిమర్ల నియోజకవర్గంలోని పోలిపల్లిలో ముగింపు సభ నిర్వహించను న్నట్లు చెప్పారు. ముగింపు సభకు టిడిపి కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం: మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి

ఏర్పాట్లు పరిశీలన

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభకు సంబంధించిన భద్రత ఏర్పాట్లను, ట్రాఫిక్‌కు సంబంధించి పార్కింగ్ ఏరియాలను పోలీసులు గురువారం సాయంత్రం పరిశీలించారు. ఎఎస్‌పి ఆస్మా ఫర్హాన్, డిఎస్‌పి గోవిందరావు సభ స్థలంతో పాటు పార్కింగ్ ఏరియాలను పరిశీలించారు. సభా స్థలం వైపే వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సభకు ఎదురుగా హైవేలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం రూట్ లో పార్కింగ్ ఏర్పాటు చేస్తే రోడ్ క్రాస్ చేసేటప్పుడు ఇబ్బంది అవుతుందని నాయకులకు సూచించారు. సిఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - భోగాపురం

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ, ముఖ్యంగా పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని జనసేన నాయకులు లోకం మాధవి, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత లోకం ప్రసాద్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రెండు ఐటి పార్కుల ద్వారా 300 కంపెనీలు ఏర్పాటు చేసేం దుకు ప్రయత్నిస్తామన్నారు. వీటి ద్వారా నిరుద్యోగ సమస్య కొంత తీరుతుందన్నారు. సహజ వనరులు ఉన్నప్పటికీ వాటిని ఎలా వినియోగించుకోవాలన్న విషయం ఎవరికీ తెలియడం లేదన్నారు. యువతకు ప్రభుత్వం గానీ ప్రజా ప్రతినిధులు సహకారం ఎంత మాత్రం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉత్తరాంధ్ర వెనుక బడిన జిల్లాలని రాజకీయ నాయకులు చెప్తున్నారు తప్ప వెనుకబాటుతనాన్ని రూపుమాపడానికి ఎటు వంటి ఆలోచనా చేయడం లేదన్నారు. ఈ ప్రాంతం లో తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులు ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు లేకపోవడంతో వేటాడి తెచ్చిన మత్స్య సంపద దళారీలకు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిం దన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వనరులకు అనుకూలంగా కుటీర, పరిశ్రమలు స్థాపిస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చి గ్రామాలు అభివృద్ధి చెందు తాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో 25 ఏళ్ల కిందట మిరాకిల్ సంస్థ ఏర్పాటు చేసి అంచెలం చెలుగా అభివృద్ధి చేయడంతో పాటు ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించామ న్నారు. ఈ ప్రాంత వాసులు బాగుపడాలనే లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న వనరులతో పరిశ్రమలు పెట్టి చదువుకున్న యువత ఎలా ముందుకు సాగాలని ఆలోచనతో ప్రాజెక్టులు డిజైన్ చేశామని వాటిని చూపించారు. 2024లో టిడిపి జనసేన పార్టీలు సంయుక్తంగా పోటీ చేయడంతో రాష్ట్రంలో అధికారం వస్తుందన్నారు. వీటిని వివరించి చదువుకున్న పేద యువతీ, యువకులను, ముఖ్యంగా రైతులను అన్ని విధాల ఆదుకునే విధంగా ప్రాజెక్టులు రూపకల్పన చేశామని ఉత్తరాంధ్రలో పరిశ్రమలు తీసుకువచ్చే విధంగా తాము కృషి చేస్తామని అన్నారు.



డిజైన్ వివరాలను చూపిస్తున్న ప్రసాద్

ముగిసిన వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానం ఆవరణలో మూడు రోజులుగా శారద ఫెర్రో ఇండస్ట్రీస్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. వాలీబాల్ కోచ్‌లు గవర సూరిబాబు, కె కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఎల్‌జిఎన్ కుమార్ పర్యవేక్షణలో జరిగాయి. ఈ పోటీలలో మండల నలుమూలల నుంచి 41 వాలీబాల్ జట్లు పోటీ పడగా ప్రథమ స్థానంలో దెందేరు, ద్వితీయ స్థానంలో వడ్డీపేట, మూడవ స్థానంలో కొత్తవలస, నాలుగవ సానంలో రాయపు రాజుపేట నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో శారద కంపెనీ సీనియర్ జిఎమ్ హెచ్ఆర్ ప్రభాత మోహన్, శత్రుఘన్ సింగ్, హెచ్. సన్యాసి రావు, సూర్య భాస్కర్, హెచ్. పద్మాకరరావు, ప్రభాత మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతిని అందిస్తున్న ఎమ్మెల్యే

విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విఆర్ఎలకు తెలంగాణ మాదిరి పేస్కేల్ అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యాన గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి వినతి అందించారు. నామినీలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలని, అర్హులకు నాలుగో తరగతి ఉద్యోగులుగా ప్రమోషన్ ఇవ్వాలని, టిఎ, డిఎ రద్దు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే డిమాండ్ల సాధన కోసం ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, గోపాల్, రాజు, సన్యాసినాయుడు, అప్పారావు, సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జనసేన 'మన ఊరిలో జనవాణి'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడ, మధుపాడ గ్రామాల్లో గురువారం రాత్రి జనసేన ఆధ్వర్యంలో మన ఊరిలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ లోకం మాధవి ఇంటి ఇంటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ జనసేన సిద్ధాంతాలు, మేనిఫెస్టోను వివరించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన ప్రభుత్వ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ప్రజలు వాళ్ళ సమస్యలు తెలియజేస్తూ ప్రభుత్వాలు మారిన తమకు రోడ్డు వేయటం లేదని కనీసం వీధి దీపాలు కూడా లేవని ఈ సమస్యని ఎవరికి చెప్పాలో తెలియక అయోమయ స్థితిలో ఉన్నామన్నారు. ప్రస్తుతం ఉన్న నాయకులకు తమ ఊరు ఒకటి ఉందని కూడా గుర్తించటం లేదని గత ఐదేళ్లలో ప్రభుత్వ అధికారులు కానీ నాయకులు కానీ తమ ఊరికి వచ్చి సమస్యలు తెలుసుకోలేదని మధుపాడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సతివాడ కల్లాలలో లోకం మాధవి రైతులతో చర్చించి జరిగిన పంట నష్టం రైతు కష్టాలు తెలుసుకొని తప్పకుండా జనసేన ప్రభుత్వం రాగానే రోడ్డు వేయిస్తామని, ప్రతి ఇంటికీ మంచినీళ్ల కొళాయి వచ్చేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కరుమజ్జి గోవింద్, రామచంద్ర, బద్రి, అశోక్, హైమ, రేవల రమణ, దుర్గసి శేఖర్, లోకేష్, వేణు, జగదీష్, అశోక్ పాల్గొన్నారు.

మున్సిపల్ డిఇగా కనకరాజు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపల్ డిఇగా కనకరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇంఛార్జి డిఇగా ఎఇ రవికుమార్ బాధ్య తలు నిర్వర్తించారు. జివిఎంసిలో డిఇగా పని చేసిన కనకరాజు బొబ్బిలి డిఇగా బాధ్యతలు స్వీక రించి మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు పని చేస్తామని కనకరాజు చెప్పారు. తోటి ఉద్యోగులతో కలిసి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అంగన్‌వాడీల సమ్మెపై అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్ వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మెపై సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె కాలంలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించడానికి సూచనలు జారీ చేసిందన్నారు. సమ్మె పూర్తి అయ్యే వరకూ ప్రభుత్వం నుండి ఎప్పటికప్పుడు విడుదల వుతున్న మార్గదర్శ కాలను, సూచనలను పాటించాలని సూచిం చారు. ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు సచివాలయాల వారీగా నమోదు చేసుకున్న క్రీడాకారులతో క్రీడలు వారీగా జట్టులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంబందింత క్రీడా ప్రాంగనాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసి ముందుగా ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రిని సిద్దంచేసుకోవాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

శాశ్వత భూహక్కు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గంలో గల అసైన్డ్ భూములకు శాశ్వత భూహక్కు పట్టాలను గురువారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సాగు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ప్రామాణికంగా అర్హులకు పథకాలను అందిస్తున్నామని అందులో భాగంగానే నియోజకవర్గంలోని ఐదు మండలాలలో గల అసైన్డ్ భూములను 22 ఏ జాబితా నుండి తొలగించి లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ భూ హక్కు పథకం కింద సుమారు 336 ఎకరాల భూమిని 652 మంది లబ్ధిదారులకు పట్టా పాసుపుస్తకాలు, అడంగల్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఎఎంసి ఛైర్‌పర్సన్ మూకల కస్తూరి, పంచాయతీరాజ్ జోనల్ ఇంచార్జ్ సత్యనారాయణ, ఎంపిపిలు దొగ్గ సత్యవంతుడు, నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసిలు నెక్కల శ్రీదేవి, తూర్పాటి వరలక్ష్మి, గొర్లె సరయు, శానపతి అప్పారావు, రాష్ట్ర ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, సిపిఎం వేపాడ మండల కార్యదర్శి చల్లా జగన్, వైసిపి మండల అద్యక్షులు మమ్ములూరి జగన్నాధం, మోపాడ కుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

చింతపల్లిలో గడపగడపకు..

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఇల్లవద్దకే సంక్షేమ పథకాలును అందించిన ప్రభుత్వం వైసిపిదేనని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయడు అన్నారు. గురువారం మండలంలోని చింతపల్లి సచివాలయం-2 పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రమేష్, నాయకులు జనార్ధన్, జిల్లా మత్స్యకార సంఘ నాయకులు బర్రి చిన్నప్పన్న, సర్పంచ్ బర్రి ముసలి, నాయకులు పబ్బిరెడ్డి అప్పలదుదొర, బర్రి దాసు, ఎంపిడిఒ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కోనుగోలు కేంద్ర ప్రారంభం

మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలన్న ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుందీ ప్రభుత్వం అన్నారు. రైతుకు ఆదుకోవడానికి ఈ ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ పిఎసిఎస్ చైర్మన్ మహంతి లక్ష్మణరావు, సర్పంచి టి. సీతారాం, ఎఒ నీలిమ తదితర నాయకులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ